నిద్దరోతున్న నిఘా నేత్రం!

- పట్టణంలో 32 సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రధాన కూడళ్లలో పనిచేయని వైనం
- పట్టణంలో పెరుగుతున్న చిల్లర దొంగతనాలు
- ఒకే రోజు ఇనోవా, బైకు, 11 తులాలకు పైగా బంగారం చోరీ

ఈ నెల 15వ తేదీన శ్రీ నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం రోజున ప్రభుత్వాసుపత్రి దగ్గర నిలిపిన ఇన్నోవా క్రిస్టా, మరో చోట ఒక బైకు అపహరణకు గురి కాగా, జాతరలో 11 తులాలకు పైగా బంగారం చోరీకి గురైంది. పట్టణంలోని కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాలు పనిచేసివుంటే ఇన్నోవా చోరీకి గురైన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యేవి. దొంగను సులభంగా పట్టుకునేందుకు వీలుండేది. కెమెరాలు పనిచేయకపోవటంతో చోరీకి గురైన ఇన్నోవాను ఎటువైపు తీసుకెళ్లారో కూడా తెలియని పరిస్థితి. పోలీసులకు అంతు చిక్కని సమస్యగా మారింది. ఇలాంటి ఎన్నో ఘటనలు పట్టణంలో చోటుచేసుకుంటు న్నాయి. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయిస్తే వీటికి అడ్డుకట్టవేసే వీలుంటుంది.

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ సమస్యలపై నిఘా ఉంచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం పట్టణంలో నిఘా నేత్రం నిద్రపోతున్నట్లు ఉంది. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు పని చేయకపోడవంతో దొంగలపని సూలువవుతోందని, వారిని గుర్తించే అవకాశం లేకుండా పోతోందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దొంగలు, అసాంఘిక శక్తులు తని చేసుకొని ఎవరికీ దొరక్కుండా జారుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన కూడళ్లలో పని చేయని కెమెరాలు..

పట్టణంలో లక్షా ఇరువై వేలకు పైగా జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణ పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, బైపాస్‌తో పాటు నలువైపుల 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రధాన కూడళ్లలో అవి పనిచేయకపోవటంతో ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడళ్లైన శివ సర్కిల్, సోమప్ప, సర్కిల్, ఆదోని రోడ్డ్ వై జంక్షన్, కర్నూలు, గూడురు బైపాస్ రోడ్డు, మార్కెట్‌యార్డ్ రోడ్డు, మంత్రాలయం, కోసిగి రోడ్డు, శ్రీనివాస, సోమేశ్వర, గాంధీ, ఓంశాంతి సర్కిల్, బంగారు బజారు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వివిధ కారణాలు చేత పనిచేయడం లేదు. దీంతో దొంగతనాలు, ప్రమాదాలు, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడిన వారు సులభంగా తప్పించుకొని ప్రధాన కూడళ్లను దాటుకొని పరార్ అవుతున్నారు. అదే కెమెరాలు పనిచేస్తే సీసీ కెమెరాలో నమోదైన రికార్డును బట్టి నిందితులు, అనుమానితులను పట్టుకునేందుకు సులభంగా ఉండేది.



సోమప్ప సర్కిల్లో పనిచేయని సీసీ కెమెరాలు



శివ సర్కిల్‌లో మూగబోయిన సీసీ కెమెరాలు

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్నా..
ప్రయోజనం శూన్యం

ఆర్టీసీ బస్టాండ్ నుంచి మంత్రాలయం, ఉరుకుంద దేవస్థానాలు, కర్నూలు, ఆదోనిలకు ప్రయాణికులు వెళ్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ విజయవాడలో వాటి మానిటరింగ్ ఉండటంతో దొంగతనం జరిగినా గుర్తించే అవకాశం లేదు. దీంతో దొంగలు తమ పని సులవుగా కానిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో చిల్లర దొంగతనాలు ఎక్కువైనట్లు తెలుస్తోంది. ప్రయాణికుల్లా దొంగలు ఉంటూ, బస్సు ఎక్కేటప్పుటు చోరీలకు పాల్పడుతున్నారు.

ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు

పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఆటోలను ఎక్కడ పడితే అక్కడ నిలపుతున్నారు. గతంలో సీసీ కెమెరాలు పనిచేస్తునప్పుడు పోలీస్ స్టేషన్లో కెమెరాల్లో చూసి కానిస్టేబుల్ ట్రాఫిక్ సమస్యను నివారించేవారు. ఇప్పటికైన పట్టణ పోలీసులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి మూడో కన్ను తెరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం



పట్టణంలో పనిచేయని సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. కెమెరాలు అమర్చినచోట వైర్లు, ఇతర సాంకేతిక సమస్యల వలన సీసీ కెమెరాలు పనిచేయటం లేదు. కొన్ని చోట్ల వైర్లు తెగిపోయినట్లు గుర్తించాం. సీసీ కెమెరాల మరమ్మతుల గురించి ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

– శ్రీనివాసులు, సీఐ, ఎమ్మిగనూరు టౌన్

క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

జీవహింస మహాపాపం



భజనలు చేస్తూ ఉల్లాసంగా చిందులు వేస్తున్న శివభక్తుడు

ఆదోని అర్బన్: ప్రతి జీవికి ఆశ, బాధ, నొప్పి ఉంటాయని, జీవ హింస మహాపాపమని గురుస్వామి శైలేంద్రనాథ్ శివభక్తులకు ఉపదేశమిచ్చారు. సోమవారం స్థానిక శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని 41 రోజుల మాలధారణ పొందిన శివస్వాములకు ఆధ్యాత్మిక విషయాలను గురుస్వామి వివరించారు. ముందుగా శ్రీ శంభులింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, భక్తిగీతాలాపన, భజనలు, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు జరిగాయి.

23న మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల : మండలం సర్వ సభ్య సమావేశం ఈనెల 23వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మణిమంజరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ టి. నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్‌మెంబర్, ఇతర శాఖాధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: పట్టణంలోని హనుమాన్ నగర్, అరుంధతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో టీబీ వ్యాధి పట్ల ప్రజలకు వైద్యులు షేకున్‌బాను, రేణుశ్రీ, అనిల్‌సాగర్, వినోద్‌కుమార్ సోమవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ టీబీ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో టీబీ యూనిట్‌లో గల్ల పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలియజేశారు. వ్యాధి నిర్ధారణ తర్వాత వ్యాధిగ్రస్తునికి ఉచితంగా మందులు ఆరు నెలలు ఇస్తారని, వారికి ప్రతినెలా రూ.500 ఆరు నెలలు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తరగతి గదిలో పాఠాలు చెప్పకుండా విద్యార్థినుతో వ్యక్తిగత విషయాలను మాట్లాడుతూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. సదరు లెక్చరర్‌తో మాకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రిన్సిపాల్‌కు చెప్పినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. విద్యాలయాల్లో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతుందని తెలిపారు. ఎమ్మిగనూరు మండలం బనవాసి గురుకుల పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఘటన మరువకముందే ప్రభుత్వ బాలికల కళాశాలలో ఈ ఘటన చూస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శశిధర్, నాగరాజు, చిరు, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 22న క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ సోమవారం తెలిపారు. బెంగళూరు నుంచి ఆల్‌సెక్ టెక్నాలజీస్ వారు కళాశాలకు వస్తున్నట్లు వెల్లడించారు. సెలెక్ట్ అయిన వారు కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్‌గా బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఈ, బీసీఏ, బీటెక్ విద్యార్హత కలిగిన వారు అర్హులన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా ఈ ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొనవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ 94417 33176కు సంప్రదించాలన్నారు.

వలస వెళ్లొద్దు.. పనులు కల్పిస్తాం



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ జయరాములు

పెద్దకడబూరు:పనుల కోసం గ్రామాలు వదిలి ఎవరు వలస వెళ్లవద్దని, స్థానికంగానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కల్పిస్తామని ఎంపీడీఓ జయరాములు అన్నారు. సోమవారం పెద్దకడబూరు మండలంలోని ముచ్చిగిరి, పీకలబెట్ట, కల్లుకుంట, మేకడోణ గ్రామాల్లో కూలీలతో కలిసి ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. అయన మాట్లాడుతూ గ్రామాలు వదిలి పిల్లలతో కలిసి వెళ్లి పిల్లల జీవితాలు నాశనం చేయవద్దన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పిస్తామని, రోజు రూ.300 వేతనం వస్తుందని చెప్పారు. ఉపాధి పనులు చేసుకుని పిల్లలను బాగా చదువించుకోవాలని సూచించారు. ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్స్, పీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి



సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలనాధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరావు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్‌జహాన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే



కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వేలో భాగంగా వివరాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

ఆదోని టౌన్: కుష్టువ్యాధిపై వైద్య సిబ్బంది సోమవారం ఇంటింటి సర్వే చేపట్టారు. పట్టణంలోని అన్ని సచివాలయ పరిధిలో కుష్టువ్యాధిపై అవగాహన, సర్వే చేపడుతున్నట్లు డిప్యూటీ ఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు ఈ సర్వే ఉంటుందన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్‌లు ప్రతి ఇంటిని సందర్శించి చర్మంపై స్పర్శలేని రాగి రంగులో లేదా ఎరువు రంగు గల మచ్చలను పరిశీలిస్తారన్నారు. చెవులపై, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, చేతులకు, కాళ్లకు స్పర్శ కోల్పోవడం, చేతుల్లోని వస్తువులు జారిపోవడం, కాళ్లలోని చెప్పులు జారిపోవడం మొదలైన లక్షణాలుంటే కుష్టువ్యాధిగా అనుమానించవచ్చన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌ను సంప్రదించి ఎండీటీ మందులను క్రమపద్ధతిలో వాడితే జబ్బు నయమవుతుందన్నారు. దీని వల్ల అంగవైకల్యంను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు షెహనాజ్‌బేగం, రేణుశ్రీ, వినోద్‌కుమార్, అనిల్‌సాగర్, మహేష్, జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సఫర్నీసాబేగం తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని 12 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికను పోస్టులకు ఎంపిక చేస్తున్నామని తెలిపారు. పట్టణంలో తేరుబజార్ సెంటర్ నెం.32లో 1 ఆయా పోస్టుకు (ఈడబ్ల్యూఎస్), లింగాపురం రామయ్యకొట్టాల -52లో (ఎస్టీ), కటికె వీధి -69 (ఈడబ్ల్యూఎస్), ఎస్.నాగలాపురం-1 (ఎస్టీ), టీఎస్ కూళ్లూరు-1 (ఓసీ), టీఎస్ కూళ్లూరు-2 (ఎస్టీ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అలాగే నందవరం మండలం హాలహర్వి-2 (ఓసీ), నందవరం-6 (బీసీ-ఏ), టీ సోమలగూడురు-3 (ఓసీ), ముగతి-1 (బీసీ-బి) పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. గోనెగండ్ల మండంలో పుట్టపాశం-1 (ఎస్టీ), హెచ్.కైరవాడి-1 (బీసీ-బి) పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. 7వ తరగతి పాసైన మహిళ, వివాహమై స్థానికు రాలైన ఉండాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 లోపు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పశువుకు నట్టలనివారణ మందు వేస్తున్న వైద్యసిబ్బంది

కౌతాళం: ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యధికారి జగదీష్ అన్నారు. కౌతాళంలో సోమవారం పశువైద్యం శిబిరం నిర్వహించారు. పశువులకు టీకాలు, నట్టల నివారణ మందులు వేశారు. అనారోగ్య పశువులకు గర్భకోశ వ్యాది చికిత్స చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈనెల 30 వరకు కొనసాగుతుందని, ప్రతి రోజు రెండు గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్ దినకర్, నాయకులు వెంకటపతిరాజు, సతీష్‌నాయుడు, సౌద్రి బసవరాజు, డాక్టర్ మహేశ్వరి పాల్గొన్నారు.

బదిలీ డిపో మేనేజర్‌కు సత్కారం



డిపో మేనేజర్ అమర్నాథ్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పని చేస్తూ బదిలీపై మదనపల్లి-2 డిపోకు వెళ్లిన అమర్నాథ్‌ను సోమవారం స్థానిక డిపోలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఆయన స్థానంలో నంద్యాల డిపోలో సీఐగా పనిచేస్తూ ఇన్‌చార్జ్ డీఎంగా బాధ్యతలు స్వీకరించిన మద్దిలేటినాయుడును సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన మేనేజర్ సేవలను పలువురు కొనియాడారు.కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రఫీక్, ముస్తాక్ అహమ్మద్, ఎన్‌పీఎం సాహెబ్, ఎల్‌బీ నవాజ్, ఎస్ఎం బాషా, రహంతుల్లా, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎస్. అవినాష్ కె.సుమంగళ బి. సంధ్య

ఆదోని సెంట్రల్: రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీలకు ఆదోని నుంచి క్రీడాకారులు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సుభకర్ ఫిలిప్స్, కబడ్డీ టీం కోచ్ అమర్ ప్రకాశ్ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఆదివారం కర్నూలు స్టేడియంలో పురుషులు, మహిళల విభాగం క్రీడా పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో 40 మంది పాల్గొనగా 12 మంది ఎంపికై నట్లు తెలిపారు. ఇందులో ఆదోని నుంచి ఆరుణ్ జ్యోతి నగర్‌కు చెందిన ఎస్.అవినాష్, హనుమాన్ నగర్‌కు చెందిన కె.సుమంగళ, టిజిల్ కాలనీకి చెందిన బి.సంధ్య ఎంపికై నట్లు వెల్లడించారు. వీరు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్టణం అనకాపల్లి, అంకుపాలెంలో జరిగే ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

23న రాయలసీమ విద్యార్థుల సదస్సు

ఆదోని సెంట్రల్: పట్టణంలో ఈ నెల 23వ తేదీన జరిగే రాయలసీమ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు రంగస్వామి, మహేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నిత్యం కరువు కాటకాలతో పాటు నీటి కొరత వ్యవసాయం, పారిశ్రామిక సంక్షోభంతో ప్రజలు అల్లాడి పోతున్నారని తెలిపారు. బతుకు జీవుడా అంటూ ప్రజలు వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాయలసీమ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. రాయలసీమ విద్యార్థుల సదస్సులో విద్యా, ఉపాధి రంగ సమస్యలు, పరిష్కారానికి పోరాట కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, మేధావులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులివ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: జీఓ నెంబర్ 223ను రద్దు చేసి స్కూల్ అసిస్టెంట్లుగా పని చేసే వారికి జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శిటి కె.జనార్దన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాలూకా స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 2002లో జేఎల్‌లుగా చివరిసారిగా పదోన్నతులు ఇచ్చారని తెలిపారు. అలాగే 2023లో పదోన్నతులు, బదిలీలు పొందిన వారికి బదిలీల్లో అవకాశం కల్పించాలన్నారు. ప్రతి నెల ఉపాధ్యాయులకు ఒకటవ తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.21వేల కోట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌టీయూ నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, బాబయ్య, యల్లప్ప, చంద్రశేఖర్, ఎర్రిస్వామి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఎవరికీ లంచం ఇవ్వొద్దు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్. పార్థసారథి

ఆదోని రూరల్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎవరూ ఒక్కరూపాయి లంచం ఇవ్వొద్దని, ఎవరైనా లంచం అడిగినట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు. సోమవారం సాయంత్రం ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్, సిబ్బంది, డాక్యుమెంటర్ రైటర్లు, ప్రజలతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలు అధికారులను తొందర పెట్టకుండా సంయమనం పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పా ప్రయివేట్ వ్యక్తులు ఆఫీసులో ఉండడానికి వీలులేదని ఆదేశించారు.

ఎంఈఓ వ్యవస్థను నిర్వీర్యం చేయడం తగదు



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజినేయులు

ఆదోని సెంట్రల్: పాఠశాల విద్యావ్యవస్థలో ఒక భాగమైన మండల విద్యాధికారి వ్యవస్థను నూతన క్లస్టర్ పేరుతో నిర్వీర్యం చేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యుడు బి. మహాదేవప్ప అన్నారు. సోమవారం ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజినేయులు అధ్యక్షతన ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలకు పాఠశాల పనితీరు, ఉపాధ్యాయుల పనితీరు పర్యవేక్షించడానికి క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామంటూ విద్యాశాఖ అధికారులు మ్యాపింగ్ చేస్తున్నారన్నారు. దీంతో ప్రధానోపాధ్యాయులపై పని భారం పెరిగి ఉన్నత పాఠశాలల్లో విద్యావ్యవస్థ దెబ్బతింటుందని తెలిపారు. తక్షణమే స్పందించి క్లస్టర్ మ్యాపింగ్ చేయడం అపాలని కోరారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఉపాధ్యాయ బదిలీలలో విద్యా సంవత్సరం అనుగుణంగా బదిలీలను జరపాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామకృష్ణ, సుధాకర్ బాబు, రాము, వెంకటేశ్వర్లు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ భావజాలంపై పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: మత తత్వ భావజాలంపై పోరాటం చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఇటీవల పట్టణంలోని నిర్వహించిన 23వ జిల్లా మహాసభల విజయవంతంపై సోమవారం స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో అభినందన సభను నిర్వహించారు. పట్టణ కార్యదర్శి గోవిందు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. లౌకిక వాదాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, ఆనంద్‌బాబు, రామాంజినేయులు, గురుశేఖర్, బి.వెంకటేశ్వర్లు, రాముడు, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన మూకప్ప(59) కోలుకోలేక సోమవారం మృతిచెందారు. బంధువులు ఔట్‌పోస్టు కానిస్టేబుల్‌కు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని రోజులుగా మూకప్ప అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రోగం తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం ఎక్కువ మాత్రలు వేసుకోవడంతో ఆరోగ్యం మరింత విషమించింది. దీంతో బంధువులు ఆయనను ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మూకప్ప సోమవారం మృతిచెందాడు. అయితే మూకప్ప శరీరం నుంచి వాసన రావడంతో వైద్యులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలి



ధర్నా చేస్తున్న పెసలబండ గ్రామ ఉపాధి కూలీలు

ఆదోని రూరల్: మండలంలోని పెసలబండ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా మల్లికార్జునస్వామిని కొనసాగించాలని సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలు ధర్నా చేపట్టారు. వారి ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు మద్దతు తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు.

25లోగా ఫీజు చెల్లించాలి

ఎమ్మిగనూరుటౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీ పరిధిలో చదువుకుంటున్న బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ఈనెల 25లోగా ట్యూషన్ ఫీజులను చెల్లించాలని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ బలరాముడు సోమవారం తెలిపారు. అదేవిధంగా ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫీజులను ఈనెల 30 తేదీలోగా చెల్లించాలన్నారు. ఆయా పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. విద్యార్థులు ఫీజులను ఆన్‌లైన్‌లో చెల్లించాలని, వివరాలకు స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి



భూ రీ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీపీ గొల్ల కేశన్న

ఎమ్మిగనూరురూరల్: భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొల్ల కేశన్న అన్నారు. సోమవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో భూముల రీ సర్వే పనులను ఎంపీపీ కేశన్న, తహసీల్దార్ శేషఫణి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులు తమ పొలాలు వద్ద భూ సర్వే జరిగేసమయంలో అక్కడే ఉంటే ఏమైనా సమస్యలు తలెత్తితే పరిష్కరించుకోవచ్చని చెప్పారు. భూ సర్వే తరువాత పొలాల్లో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారన్నారు.

రైతులు సహకారించాలని

నందవరం : రీ సర్వేకు రైతులు సహకారించాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేష్ కోరారు. సోమవారం మండల పరిధిలోని నదికై రవాడి గ్రామంలోని రైతు తంబల విరుపాక్షప్ప పొలంలో భూమి చేసి రీ సర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, ఎస్ఐ ఇస్మాయిల్

ఎమ్మిగనూరురూరల్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నందవరం మండలంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యాన్ని మీడియాకు చూపారు. ఆయన మాట్లాడుతూ నందవరం మండలం గంగవరం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదోనికి చెందిన బోయ ఈరమ్మ, బోయ హనుమంతమ్మ, బోయ మానసల వద్ద నుంచి 720 ఒరిజనల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు దొరికాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 30 వేలు ఉంటుందని తెలిపారు. నిందితురాళ్లను మేజిస్ట్రేట్ ముందు హాజరపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఇస్మాయిల్, హెచ్‌సీ గోపాల్, పీసీలు కరుణాకర్, సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల పరిధిలో కందుకూరు గ్రామంలో రమేష్ అనే వ్యక్తి అక్రమంగా ఇంట్లో కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్ తెలిపారు. సోమవారం అందిన సమాచారం మేరకు గ్రామంలో పర్యటించి మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద 960 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ సుమారు రూ.40వేలు చేస్తుందని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇందులో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.